క్లుప్తంగా

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

క్రోసూరు: క్రోసూరు ఆదర్శ పాఠశాలలో సోమవారం జరిగిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్స్‌పాల్ మేరీ సూజన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు 217 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 191 మంది హాజరైనట్లు చెప్పారు. పరీక్ష రాసిన వారిలో రోస్టర్, మెరిట్ ప్రాతిపదికన 100 మందికి సీట్లు కేటాయించబడతాయన్నారు. సీటు సాధించిన విద్యార్థులు ఇంటర్ వరకు అంటే ఏడు సంవత్సరాల పాటు ఎటువంటి ఫీజు లేకుండా ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించ వచ్చని ప్రిన్స్‌పాల్ తెలిపారు.

చెరువు పోరంబోకు భూమి ఆక్రమించుకుంటే కఠిన చర్యలు

తహసీల్దార్ నాగరాజు

క్రోసూరు: చెరువు పోరంబోకు భూమి ఆక్రమించుకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వి.వి.నాగరాజు సోమవారం హెచ్చరించారు. క్రోసూరు చెరువుకట్ట వద్ద అభయాంజనేయస్వామి విగ్రహం పరిధిలో కొంత మంది చెరువు పోరంబోకు భూమి 594/2 ఆక్రమించుకునేందుకు గత కొద్ది రోజులుగా జెండాలు పాతారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో జి.శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించి ఆక్రమించుకున్న వారిని పిలిపించి హెచ్చరించారు. అనంతరం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ఎవరికి వారు స్వచ్ఛందంగా ఆక్రమణ జెండాలు తొలగించారు.

జేఈఈ మెయిన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ



క్రోసూరు: క్రోసూరు మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థిని మాలవత్ వైష్ణవిబాయి జేఈఈ మెయిన్‌లో (2025) 566వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ మేరీ సూజన్ సోమవారం తెలిపారు. 95.143 పర్సంటైల్‌తో సత్తాచాటిందన్నారు. విద్యార్థినిది మండలంలోని పెరికపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కటుంబమని చెప్పారు. వైష్ణవి 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏపీ మోడల్ స్కూల్, క్రోసూరులో చదువుకుందని ఇంటర్‌లో 929/1000 సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని ఇంతటి అద్భుత విజయం సాధించటం సంతోషకరమని, మరెన్నో విజయాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

24 నుంచి ప్రహ్లాద బడి వేసవి శిక్షణ శిబిరం

సత్తెనపల్లి: వేసవి కాలాన్ని పురస్కరించుకొని ఈ నెల 24 నుంచి సత్తెనపల్లిలో ప్రహ్లాద బడి వేసవి శిక్షణ శిబిరం ఇస్కాన్ నరసరావుపేట ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని ఇస్కాన్ భక్తివక్ష కేంద్రం నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి మే 18 వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. శిక్షణ శిబిరంలో మృదంగం, అన్నమయ్య కీర్తనలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, త్రెడ్ జ్యూయలరీ, చిత్రలేఖనం, భగవద్గీత శ్లోకాలు తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. పట్టణ రైల్వే స్టేషన్ రోడ్‌లోని పాత శ్రీరామ్ చిట్స్ బిల్డింగ్‌లో ప్రహ్లాదబడి శిక్షణ శిబిరం జరుగుతుందన్నారు. వివరాలకు 93984 89147, 98491 87976, 90104 68242 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం



బాలెమర్రు(క్రోసూరు): మండలంలోని బాలెమర్రు ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శరత్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో అడ్మిషన్లు మరింత పెరగాలని, పాఠశాల ఈ విద్యా సంవత్సరం నుంచి బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మారిందని తెలియజేశారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు బొబ్బా రాధాకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వేపై అనుమానాలుంటే అధికారుల దృష్టికి తేవాలి

ముప్పాళ్ళ: మండల పరిధిలోని గోళ్ళపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియపై రైతులకు ఏమైనా అనుమానాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో రీ సర్వేలో భాగంగా ప్రారంభమైన హద్దుల ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. రెవెన్యూ గ్రామాన్ని ఆరు భాగాలుగా విభజించడం జరిగిందని, మొత్తం ఆరు టీములు రీ సర్వేలో పాల్గొంటాయన్నారు. గ్రామానికి సంబంధించి హద్దుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే సర్వే జరిగే ప్రాంతంలోని రైతులందరికీ ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టీ సుధాకర్, విలేజ్ సర్వేయర్ నాగూర్‌మీరా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం



సైడు కాలువలో పేరుకుపోయిన మురుగునీరు, పాచి



ప్రాథమిక పాఠశాల, చర్చి సమీపంలో అధ్వానంగా మురుగు కాలువ

- సమస్యల వలయంలో నకరికల్లు ఎస్సీ కాలనీ
- మురుగునీటితో పొంగిపొర్లుతున్న సైడు కాలువలు
- రక్షిత మంచినీటి ప్రధాన పైపులైనుకు లీకేజీ
- తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం

నకరికల్లు: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అంటూ ప్రచారంలో ఆర్భాటం చూపించే కూటమి ప్రభుత్వం అమలులో చిత్తశుద్ధి కనిపించడం లేదు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పలు చోట్ల పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పైపులైన్లకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతుంది. వేసవిలోనే ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో మరింత అధ్వాన్నంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కరించాలని కోరుతున్న కాలనీ వాసులు

స్థానిక పాతూరులోని ఎస్సీ కాలనీ సమస్యల వలయంలో చిక్కుకుంది. పారిశుద్ధ్య సమస్యలతో పాటు మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యంతో కాలనీలోని సమస్యల పరిష్కారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా తయారైంది. స్థానిక కొండపై గల ఇందిరమ్మ ఎస్సీ కాలనీలో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న రక్షిత మంచినీటి పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. దీంతో తాగునీరు పైకి ఎగసిపడి వృథాగా మురుగునీటి కాలువలో కలుస్తుంది. గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నా మరమ్మతుకు నోచుకోలేదు.



రక్షిత మంచినీటి ప్రధాన పైపులైను లీకేజీతో ఎగసిపడుతున్న తాగునీరు

- సైడు కాలువల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. కాలువల గుండా మురుగు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మురుగునీరు, షిల్ట్ పేరుకుపోయి పచ్చగా పాచిపట్టాయి. మురుగు కాలువ పొంగి పొర్లుతుంది.
- అదే ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. దానికి కనీస రక్షణ వలయం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆడుకునేందుకు వచ్చే పిల్లలు, పెద్దలకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- అలాగే ఎస్సీ కాలనీ ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాల, చర్చి, కమ్యూనిటీ హాలు కలసి ఉన్న ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. కాలువలు షిల్ట్‌తో నిండిపోవడంతో మురుగునీరు పొంగిపొర్లుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్లలో నీళ్ల అధికంగా వినియోగించే సమయంలో రోడ్డు పైకి మురుగునీరు వచ్చి చేరుతుంది. ఇన్ని రకాల సమస్యలతో కాలనీ వాసులు సతమతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దళితుల సాంఘిక బహిష్కరణకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

క్రోసూరు: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలో దళితుల సాంఘిక బహిష్కరణకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షులు చిలకా భాస్కరరావు, రాష్ట్ర హానర్బల్ చైర్మన్ గార్లపాటి దాసు, చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ బంకా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం క్రోసూరులో అంబేడ్కర్, జగ్జీవనరామ్ విగ్రహాల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో పాలకులు, పెత్తందారులు కలసి దళితులకు నిత్యావసరాలు విక్రయించరాదని, పాల కేంద్రాల్లో పాలు ఇవ్వరాదని నిర్ణయించడం సిగ్గుచేటని అన్నారు. ఈ నెల 16న గ్రామానికి చెందిన దళిత యువకుడు పల్లపు సురేష్ అదే గ్రామానికి చెందిన వలిశెట్టి జల్లిబాబు ఇంటిలో కరెంటు వైరింగ్ పని చేస్తూ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందగా, మృతుని కుటుంబానికి న్యాయం చేయకపోగా దళితులను సాంఘిక బహిష్కరణ చేయటం దుర్మార్గమని అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకొని వెంటనే దళితుల బహిష్కరణకు పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న జి.దాసు, చిలకా భాస్కరరావు

మెగా డీఎస్సీ సిలబస్ తగ్గించాలి



జొన్నలగడ్డ విజయ్‌కుమార్

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ సిలబస్ తగ్గించి పరీక్షకు 90 రోజుల వ్యవధి ఇవ్వాలని న్యాయవాది, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన జొన్నలగడ్డ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దరఖాస్తుకు పరీక్షలకు మధ్య వ్యవధి 45 రోజులు మాత్రమే ఉందని, ఆ సమయం సరిపోదని కనీసం 90 రోజులకు పెంచాలని ఆయన సూచించారు. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న డీఎస్సీ కావటంతో వయో పరిమితి 44 నుంచి 47 ఏళ్లకు పెంచాలన్నారు. అంతే కాకుండా ఎస్జీటీలకు ఇంటర్‌లో 50 శాతం, ఎస్ఏలకు డిగ్రీలో 50 శాతం, పీజీటీకి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు తప్పనిసరి చేయడం తగదన్నారు. అభ్యర్థుల అర్హతలు, కనీస మార్కుల శాతం తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో సందేహాలు, ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ డీఎస్సీలో అమలు చేయటంపై పలు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. నిరుద్యోగుల సందేహాలు, డిమాండ్లను పరిశీలించి ఆ మేరకు అవకాశం కల్పించాలన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ పోతుగంటికి సత్కారం

సత్తెనపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఆర్యవైశ్య సంఘ నాయకుడు, వాణిజ్య విభాగం జిల్లా నాయకుడు పోతుగంటి రామకోటేశ్వరరావును సోమవారం పలువురు అభినందించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ముందుగా ఏజీకేఎం కళాశాలలో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టి సాంబశివరావు ఆధ్వర్యంలో చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో దాదాపు 40 మంది సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భవిరిశెట్టి వారి వీధిలో ఆర్యవైశ్య యువజన సంఘం నాయకుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో, అలాగే ఏరియా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు జవ్వాజి రామమోహనరావు ఆధ్వర్యంలో పోతుగంటి రామకోటేశ్వరరావుకు చిరు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏజీకేఎంలో పోతుగంటిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ బాధ్యులు

బాంధవ్యాలు మెరుగుపడి పూర్వీకులను స్మరించుకోవాలి

సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఉల్లం అజయ్

సత్తెనపల్లి: బంధాలు, అనుబంధ బాంధవ్యాలు మెరుగుపడాలని, పూర్వీకులను స్మరించుకోవాలని తెలంగాణ రాష్ట్రం సిర్పూర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఉల్లం అజయ్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో ఉన్న హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు కార్యాలయం వద్ద కీర్తిశేషులు ఉల్లం వెంకటేశ్వర్లు, కీర్తిశేషులు తోట సత్యనారాయణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో మనవడు న్యాయమూర్తి ఉల్లం అజయ్, ధర్మపత్ని కిరణ్మయి ఆర్థిక సహాయంతో 120 మందికి సోమవారం ఉచితంగా భోజనం అందించారు. ముందుగా వీరి తాత ఉల్లం వెంకటేశ్వర్లు విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పించారు. పూర్వీకులను స్మరించుకుంటూ ప్రతి సోమవారం అన్నసంతర్పణ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉల్లం శేషగిరిరావు, దివ్వెల శ్రీనివాసరావు, ఉసిరికాయల సాంబశివరావు, నర్రా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



అన్నసంతర్పణ చేస్తున్న న్యాయమూర్తి ఉల్లం అజయ్, కిరణ్మయి దంపతులు

రిటైర్డ్ తెలుగు పండిట్ రాధాకృష్ణమూర్తి మృతి



కొల్లిపర రాధాకృష్ణమూర్తి

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల రిటైర్డ్ గ్రేడ్–1 తెలుగు పండిట్ కొల్లిపర రాధాకృష్ణమూర్తి (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. పట్టణంలోని నాగార్జునగర్‌లో నివశిస్తున్న రాధాకృష్ణమూర్తి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 19న ఆయనను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచాడు. మృతుడికి భార్య జానకి, కుమార్తె ఉన్నారు. 1951 ఏప్రిల్ 20న జన్మించిన రాధాకృష్ణమూర్తి 2025 ఏప్రిల్ 20న మృతి చెందాడు. పుట్టిన రోజు నాడే మృతి చెందాడు. రాధాకృష్ణమూర్తి తెలుగు పండిట్‌గా పనిచేస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన మరణ వార్త తెలియడంతో పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. రాధాకృష్ణమూర్తి పార్థివ దేహాన్ని పలువురు రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సోమవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం సత్తెనపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. పార్థివదేహాన్ని సందర్శించిన వారిలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, బొడ్డు రామారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు జెట్టి రమేష్, కె.నాగవర్ధన్, మూర్తి ప్రకాశరావు, తిరుపతి జ్ఞానానందం(చిన్నా) తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటకం

పెదకూరపాడు: అంతరించిపోతున్న నాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పాటిబండ్ల గ్రామ కళాకారులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇటీవల కాలంలో పాటిబండ్ల ముగ్గురు రాజుల దేవాలయం సిల్వర్ జూబ్లీ సందర్భంగా గ్రామంలోని కళాకారులు పలువురు సాంఘిక నాటకాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సాగర్‌మాత యువ నాట్య కళా మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంఘిక నాటకం రౌడీ సర్దార్ నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించేందుకు నాటక ప్రదర్శన చేస్తున్నట్లు నిర్వాహకులు తెలపడంతో కళాభిమానులు, వీక్షకులు సంతోషం వ్యక్తం చేశారు.



సాంఘిక నాటకంలోని దృశ్యాలు

వివాహిత అనుమానాస్పద మృతి

సత్తెనపల్లి: వివాహిత మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన గుంటగాని వేణు, కట్టవారిపాలెంకు చెందిన శిరీష(34)కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 ఏళ్ల కుమారుడు, 13 ఏళ్ల కుమార్తె ఉన్నారు. వేణు బేల్దారి మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు మధ్య కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భర్త, పిల్లలు నిద్రిస్తున్న సమయంలో శిరీష ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. అయితే శిరీష మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి భర్త వేణును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

నాటుసారాతో అనర్థాలు తెచ్చుకోవద్దు

తహసీల్దారు కె.పుల్లారావు



నాటుసారా కేసులో మహిళలను హెచ్చరిస్తున్న తహసీల్దారు పుల్లారావు

నకరికల్లు: నాటుసారా జోలికి వెళ్లి అనర్థాలు తెచ్చుకోవద్దని తహసీల్దారు కె.పుల్లారావు హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చేజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను నాటుసారా కేసులలో తహసీల్దారు ఎదుట ఎక్సైజ్ పోలీసులు సోమవారం హాజరు పరిచారు. బైండోవర్ చేసిన సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఏ కేటగిరీ పరిధిలోని చేజర్ల గ్రామంపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించిందన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి: వేసవి కాలంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్‌తో కూడిన మజ్జిగ పంపిణీ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం సమీపంలో గాంధీ చౌక్ సెంటర్‌కి వెళ్లే రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి వేసవి కాలం మొత్తం మజ్జిగ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కొత్త రామకృష్ణ, దేవరపల్లి కాశి బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైవ్య నాయకులు పెరుమాళ్ళ లక్ష్మీశివన్నారాయణ, జవ్వాజి రామమోహన్‌రావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, దేవతి సుబ్బారావు(మెమంటో), భవిరిశెట్టి సుబ్రమణ్యం, దేవరపల్లి రాఘవ, భవిరిశెట్టి హరికృష్ణ, చెక్క రవికుమార్ తదితరులు ఉన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు



కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న అవ్వారు ప్రసాదరావు, కార్మిక సంఘ నాయకులు

సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ జారీ చేసిన 1214 మెమోను వెంటనే రద్దు చేయాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు జిల్లాలోని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులను కలసి వినతి పత్రం ఇచ్చి పెండింగ్‌లో ఉన్న రూ.1.68 కోట్లు విడుదల చేసి కార్మికుల క్లయిమ్‌లకు జమ చేయాలని కోరడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 24న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు పూనుకోవాల్సి వచ్చిందని, భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మస్తాన్‌రావు, హుస్సేన్ బాబు, కృష్ణ, హిమామ్ వలి, సాంబయ్య, కోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో నాలుగు దుకాణాలు దగ్ధం

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పలు దుకాణాలు దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. పట్టణంలోని సుభానినగర్ లాహిరి ఆస్పత్రి పక్కనే ఉన్న పిల్లల ఆటవస్తువులు విక్రయించే దుకాణాలు దగ్ధమయ్యాయి. కొన్నేళ్ల కిందట అందెల సుమంత్ కోటిబాబు ప్లాస్టిక్ ఆటవస్తువులు విక్రయాలకు వరసగా ఉన్న మూడు దుకాణాలు అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వ్యాపారం అనంతరం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో సదరు దుకాణంలో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి దుకాణం యజమాని కోటిబాబుకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

రేపు లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం–చిలకలూరిపేట డొంక రోడ్డులో కుప్పగంజివాగు పక్కనే కొలువైయున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు పూజారి కొండవీటి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం హైస్కూలు విద్యార్థులచే కోలాట ప్రదర్శన జరగనుంది. 2015లో గ్రామానికి చెందిన గాలి సాంబయ్య వాయు ప్రతిష్ట నిర్వహించగా, 2021లో ఆలయాన్ని పునర్ నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపండి

ఇంటింటి ప్రచారంలో ఎంఈవో



రాజుపాలెం: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎంఈవో మల్లిఖార్జునశర్మ అన్నారు. మండలంలోని గణపవరం బుడగ జంగాల కాలనీలో మన ఊరు–మన ప్రభుత్వ బడి కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగి మీ పిల్లలను బడికి పంపించాలని సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కాలనీవాసులు, మహిళలతో మాట్లాడుతూ మీ పిల్లలందరినీ బడిలో చేర్పించినట్లయితే వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బడి మానివేయడానికి గల కారణాలు తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట విద్యా కమిటీ చైర్మన్‌లు, మహిళా సమాఖ్య అధ్యక్షులు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com